


## వివాహిత ఆత్మహత్య

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 1 : చెన్నూర్ పట్టణంలోని బేతాళవాడకు చెందిన వివాహిత కడవండి మంజుల (35) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు. భీమారం మండలం ఖాజిపల్లి గ్రామానికి చెందిన మంజుల, చెన్నూర్‌కు చెందిన కడవండి మహేశ్ 17 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మహేశ్ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. వీరికి ముగ్గురు కొడుకులు. మంజుల రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. చికిత్స చేయించినా తగ్గకపోవడంతో బలవన్మరణానికి పాల్పడింది. కాగా, భర్త మహేశ్ వేధింపులతోనే మంజుల ఆత్మహత్య చేసుకున్నదని తండ్రి గోదారి లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మెడికల్ కార్డు వ్యత్యాసాలు సవరించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 : మెడికల్ కార్డు (సీపీఆర్ఎంఎస్) అధికారులు, కార్మికులకు ఒకే విధంగా అమలయ్యేలా బిలాస్‌పూర్‌లో 3వ తేదీన జరిగే సమావేశంలో కోలిండియా యాజమ్యాంపై జాతీయ సంఘాలు ఒత్తిడి తేవాలని టీబీజీకేఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి కోటిలింగ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలతో పాటు, మందులు, ఇతరాత్ర ఖర్చులకు రూ.25 వేలు మందస్తుగా జమచేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు కేవలం రూ.8 లక్షల వరకే వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వెంటనే ఈ వ్యత్యాసం సవరించాలని డిమాండ్ చేశారు.

## గనుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 : సింగరేణి గనుల పరిరక్షణ, గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ కార్పొరేట్ కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట 11న కార్మిక సంఘాల ఐక్య వేదిక(జేఏసీ) ఆధ్వర్యంలో ధర్నా, నిరాహార దీక్ష చేపట్టనున్నామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ హమ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ శ్రీనివాస్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఆధ్యక్షుడు మేకల రాములు, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుమారస్వామి, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు మణీరాం సింగ్ మాట్లాడారు. గనుల ప్రైవేటీకరణకు జాతీయ సంఘాలను సింగరేణి యాజమాన్యం బుజ్జగిస్తున్నదని ఆరోపించారు. సమావేశాన్ని భహిష్కరించాల్సింది పోయి యాజమాన్యానికి అనుకూలంగా మారుతున్నాయని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం జాతీయ సంపదను అధానీ, అంబానీకి కట్టబెటేటందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. వెంటనే గనుల వేలాన్ని రద్దు చేయాలని, సింగరేణికే నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బ్రహ్మానందం, పాషా, మేకల పోశం, తిప్పారపు సారయ్య, తలారి రాజయ్య పాల్గొన్నారు.

## ఎల్లూరులో విష జ్వరాలు


పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 1 : మండలంలోని ఎల్లూరులో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామంలో పారిశుధ్యం లోపించింది. పలు అంతర్గత రోడ్లు మోకాలు లోతు బురదమయంగా మారాయి. మురుగునీరు చేరి దోమలు వృద్ధి చెందాయి. దోమల మందు పిచికారీ, క్లోరినేషన్ చేయకపోవడంతో ప్రభావం తీవ్రమైంది. దీంతో గ్రామంలో టైఫాయిడ్, మలేరియా, నాలుగైదు డెంగ్యూ కేసులు కూడా నమోదయ్యాయి. దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వైద్య శిబిరాలు కూడా నిర్వహించడం లేదని వాపోతున్నారు.



పాత ఎల్లూరులో మట్టి బురద, దోమలతో రోడ్డు

## అ'పూర్వ' సమ్మేళనం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 : పట్టణంలోని టూ ఇంక్లైన్ జడ్పీ ఉన్నత పాఠశాల 1991-92 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



ఆనాటి ఉపాధ్యాయులతో 1991-92 బ్యాచ్ విద్యార్థులు

## అంటువ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

- మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్
- ఎంసీహెచ్ సందర్శన



ఎంసీహెచ్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తపడాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ సూచించారు. ఆదివారం ఎంసీహెచ్‌ను ఆయన సందర్శించారు. అందుతున్న సేవలపై సమీక్షించారు. కలెక్టర్ ఆదేశానుసారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో 24 గంటల పాటు సమాచారాన్ని చేరవేసేందుకు కంట్రోల్ రూమ్ 91770 84068 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలు, రహదారి లేని గ్రామాలు, వరదలు, నదులతో ఇబ్బంది ఉన్న గ్రామాల్లోని 15 రోజులో ప్రసవానికి సిద్ధంగా ఉన్నవారు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది దవాఖానకు తీసుకురావాలని సూచించారు. అందుకు 102 అంబులెన్స్‌లను, ప్రభుత్వ అంబులెన్స్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో బుక్క వెంకటేశ్వర్లు తదితరులుపాల్గొన్నారు.

## ఇండోర్ క్రీడలు ప్రారంభం



శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో క్రీడాకారులతో ఇన్‌చార్జి జీఎం శ్రీనివాసరావు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 : శ్రీరాంపూర్ ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్(డబ్ల్యూపీఎస్‌జీఏ) వార్షిక క్రీడల్లో భాగంగా ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఇండోర్ క్రీడలను ఇన్‌చార్జి జీఎం శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఆర్కే-5 గని మేనేజర్ అబ్దుల్ ఖదీర్, డబ్ల్యూపీఎస్‌జీఏ గౌరవ కార్యదర్శి సృజన్ పాల్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో-ఆర్డినేటర్ సకినాల నర్సయ్య, జనరల్ క్యాప్టెన్ మల్లెత్తుల శ్రీనివాస్, ఇండోర్ క్యాప్టెన్ తోట సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'రాజకీయ ఒత్తిడితో ఆగుతున్న ప్రమోషన్లు'

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 : రాజకీయ ఒత్తిడి, జోక్యంతో యాజమాన్యం కార్మికుల సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఆపుతున్నదని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరుగుతున్నదని పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లో 108 మందికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు సర్క్యులర్ జారీ చేసిందని, దరఖాస్తు చేసుకున్న కార్మికుల్లో మార్కుల ప్రకారం జాబితా విడుదల చేసి నెలలు గడుస్తున్నా ఉద్యోగోన్నతులు కల్పించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

## పీహెచ్‌సీలో వైద్యుడిని నియమించాలంటూ ఆందోళన



లింగాపూర్‌లో రోడ్డుపై ఆందోళన చేస్తున్న ప్రజలు

సిర్పూర్(యు), సెప్టెంబర్ 1 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ పీహెచ్‌సీలో వైద్యుడిని నియమించాలంటూ ఆదివారం స్థానికులు రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో ప్రజా సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో కొన్ని నెలలుగా వైద్యుడు, సిబ్బంది లేక సేవలు అందడం లేదని, ఉన్న కొద్దిపాటి సిబ్బంది ఒక రోజు డ్యూటీకి వచ్చి.. మూడు రోజులు పత్తాలేకుండా పోతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. దవాఖానలో కనీసం ట్యాబ్లెట్లు ఇచ్చే వారు దిక్కు లేరని తెలిపారు. వైద్యాధికారి, సిబ్బందిని నియమించాలని, మందులు అందుబాటులో ఉంచి గిరిజనులకు సకాలంలో వైద్య సేవలందించాలంటూ జిల్లా వైద్యాధికారికి అనేకసార్లు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడే అశ్విన్, రమేశ్, హసిరాం, గంగుపటేల్, బాపురావ్, పరశురాం పాల్గొన్నారు.

## మహంకాళి బోనాలు



బోనాలతో ఆలయం వద్ద భక్తులు

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 1 : చెన్నూర్ పట్టణంలో ఆదివారం మహంకాళి బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం చివరి ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఇంటింటా భోనంతో స్థానిక అంబేద్కర్ చౌక్ నుంచి పెద్ద ఎత్తున పట్టణ పురవీధుల గుండా మహంకాళి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై పర్యవేక్షించాలి



ఎస్సీ బాలుర వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీడీ రవీందర్‌రెడ్డి

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 1 : వసతి గృహంలోని పిల్లల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని మంచిర్యాల ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ పోటు రవీందర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలతో పాటు, కిచెన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, అలాగే సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించడంతో పాటు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా హాస్టల్స్ వార్డెన్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దండేపల్లి, సెప్టెంబర్ 1 : దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన సోగల శ్రీనివాస్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తనతో పాటు పదోతరగతి చదువుకున్న మిత్రులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.39 వేలు భార్య వరలక్ష్మికి అందించారు. మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, కొండు శ్రీనివాస్, కుమారస్వామిగౌడ్, దోమల రవీందర్, గంగాధర్, జైలు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి, సెప్టెంబర్ 1 : మందమర్రి పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన ఫొటో గ్రాఫర్ తార్లపల్లి రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. కాగా, మందమర్రి ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.5 వేలు సాయం అందించారు. అధ్యక్షుడు పసుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీశ్, ఉపాధ్యక్షుడు అనిధర్ రెడ్డి, సాయి పవన్, కార్యదర్శులు పసుల రవి, కందుకూరి శ్రీకాంత్, కేశవేని హరికృష్ణ, బదావత్ కృష్ణ, నక్క తిరుపతి, మనోజ్ పాల్గొన్నారు.